


# గతానుగతం

## కన్నసామి

*సన్నగా పొడుగ్గా ఉంటాడు. గేయాలు వ్రాసి వరసలు కట్టి వినిపించేవాడు. ఆకర్షించి హృదయం ఆక్రమించాడు. అంతస్థులలో అంతరం ఆమె పట్టించుకోలేదు. ఇంతకూ ఆమె హృదయం ఆతడు అర్థంచేసుకొన్నాడా, లేదా?*

---

**మిస్** సుందరీబాయి కారు ఆఫీసు ముందుకు వచ్చి ఆగింది. ఆఫీసు ప్యూన్ ఎదురుగావెళ్ళి నమస్కారం పెట్టి కారు తలుపు తెరిచాడు. సుందరీబాయి తిన్నగా ఆఫీసులోకి వెళ్లిపోతూ బయట వరండాను ఒకసారి కలయజూసింది. అవతల బెంచీమీద—మాసిపోయిన గడ్డంతో, చేతిలో ఏవో కొన్ని కాగితాలు పట్టుకొని—కూర్చున్న వ్యక్తి ఒక్కసారి తొట్రుపాటుగా లేచి నిలబడ్డాడు.

మధ్య హాల్లో టైపు టపటపలు ఆగిపోయాయి. గుమాస్తాలు నిలబడి నమస్కారాలందజేశారు. మళ్లా ఎవరి పనుల్లో వాళ్లు నిమగ్నులయారు. సుందరీబాయి తన రూమ్‌లోకి వెళ్లి కూచుంది. పైని ఫాన్ తిరుగుతూంది. టేబులుమీద కాగితాల కొసలు రెపరెప లాడుతున్నాయి. ఆమె దృష్టి ఆ కాగితాలమీదకు మళ్లింది. ఆ అయిదు అప్లికేషన్లలో ఒకదానిలో ఏదో ప్రత్యేకత కనిపిస్తున్నది. సుందరీబాయి ఆ

అప్లికేషన్ చూస్తూనే నిట్టూర్చింది. ప్యూన్ వచ్చి టేబుల్‌మీద స్లిప్పు ఒకటి ఉంచాడు.

"మొన్న అప్లికేష నిచ్చినాయనంట. తవుర్ని దర్శనం కోసం...."

"పంపించు."

సుందరీబాయి ఆ అప్లికేషనూ, ప్యూన్ తెచ్చిన స్లిప్పూ ఒకచోట ఉంచి చూస్తూంది. "పి. ఆర్. రావు" అన్న అక్షరాలు మాత్రమే ఆ స్లిప్పు మధ్యగా మెరుస్తున్నాయి.

"నమస్కారం"—అభ్యర్థి వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. ఆమె అతణ్ణి చూసి "కూర్చోండి" అన్నది.

సుందరీబాయి అతని ముఖం చూసి ఒక క్షణం ఏవో కాగితాలు చూసుకుంటూ ఊరుకుంది. కాగితాలు చూస్తున్నట్టు కూడా కనిపించడంలేదు. ఆలోచిస్తోంది. వచ్చిన అభ్యర్థి ఏదో అనబోతూ గొంతు సవరించుకున్నాడు. సుందరీబాయి హఠాత్తుగా "మీ పేరు?" అన్నది.

## గతాను గతం

"రామానుజరావు" అన్నాడు అభ్యర్థి. ఆమె మళ్ళా ఊరుకున్నది.

"నిన్నను తమ దగ్గర్నుంచి ఇంటర్‌వ్యూ ఆర్డరు వచ్చిందండీ, ఇక్కడ ఒక పోస్ట్ ఖాళీగా ఉందనీ......" అంటూ ఆగిపోయాడు అభ్యర్థి.

"అవును. మీ కిచ్చే పోస్టు గురించి తెలుసా?"

"తెలుసండీ. ఇలాటి పోస్టులోనే ఇదివర కొక పెద్ద కంపెనీలో పని చేశానని తమకు అప్లికేషనులో వ్రాసుకొన్నాను."

"అందుకే మీ ఒక్కరికే ఇంటర్‌వ్యూ ఇచ్చాం. ఆర్డరు టైపు అయి వస్తుంది. ప్యూన్ మీ సీటు చూపిస్తాడు. వెళ్ళండి."

రామానుజరావు ముఖం వికసించింది. సంతోషంలో కృతజ్ఞత కూడా తెలపకుండా "అలాగేనండీ" అన్నాడు. ముత్యాలు రామానుజరావును తీసుకువెళ్ళి సీటు చూపించాడు.

టైపిస్టు దగ్గర్నుంచి కాగితం పట్టుకువచ్చి సుందరీబాయి దగ్గర ఉంచాడు ముత్యాలు. ఆమె సంతకం అయిపోగానే రామానుజరావుకు అందించాడు.

బెల్ మోగింది. ముత్యాలు పరుగెత్తాడు.

రామానుజరావు సుందరీబాయి గదివైపు ఒక నిమిషం తిన్నగా చూసి తన పనిలో నిమగ్నుడయిపోయాడు.


సుందరీబాయి "ముత్యాలూ, ఆ కొత్తతనికి అన్నీ చూపించావా" అన్నది. "చూపించానమ్మా" అన్నాడు ముత్యాలు.

"ఏమైనా అంటున్నాడా?"

"అంతా చెప్పానమ్మా! అతను మరేమీ అనలేదు" అన్నాడు ముత్యాలు.

ముత్యాలు వెళ్ళిపోయాడు. సుందరీబాయి





ఏనుగుల శాల (హంపి) ఫోటో—ఎమ్. కె. రంగస్వామి అయ్యంగార్ (మద్రాసు-18)

కిటికీదగ్గర నిలబడి మొక్కలవైపు చూస్తోంది.

"ప్యూన్!"

సుందరీబాయి అటు తిరిగి చూసింది.

రామానుజరావు ముత్యాలును పిలిచాడు. ముత్యా లేదో చెబుతున్నాడు. రామానుజరావు శ్రద్ధగా వింటున్నాడు. నాలుగు నిమిషాలు అలాగే గడిచిపోయాయి.

సుందరీబాయి బెల్ కొట్టింది. ముత్యాలు వచ్చాడు.

"కొత్తతను ఏమిటంటున్నాడు?"

"మన ఆఫీసు భోగట్టాలేనమ్మా అడుగుతున్నారు."

"తన సంగతు లేమైనా చెబుతున్నాడా?"

"తెలుస్తూనే ఉంది కదమ్మా. చాలా బీదోళ్లలా ఉన్నారు. మన ఆఫీసులో మనుషుల పేర్లూ తమ పేరూ అడిగారమ్మా."

"అన్నీ చెప్పావా?"

"చెప్పానండి."

"ఏమంటాడూ?"

"మరేమీ అనలేదండీ. తమ రెన్నాళ్లయింది ఇక్కడ పని చేస్తున్నారో అడిగారండి."

"ఆఁహ! చెప్పావా?"

"చెప్పానండి."

"ఏమంటాడూ?"

"ఇంకేమీ అనలేదండీ. ఎందుకో అతనిలో అతనే నవ్వుకొని మళ్లా పని చేసుకుంటున్నారండి."

ముత్యాలు కివాళ అంతా కొత్తగా ఉంది. అమ్మగారు ఏదో పరధ్యానంగా మాట్లాడుతున్నా రనిపించింది.

సుందరీబాయి ఆలోచిస్తోంది. ఇతను..... ఇతన్ని......తనకు తెలుసు. ఎక్కడో....ఎప్పుడో ......తెలుసు.

"ముత్యాలూ, అతన్ని పిల్చుకురా." ముత్యాలు రామానుజరావును తీసుకువచ్చాడు.

"మీ సీట్లో కాగితాలన్నీ సరిగ్గా ఉన్నాయా?"

"ఉన్నాయండి."

"ఉద్యోగస్థుడు పరిశుభ్రమైన బట్టలతో జుట్టుకు కాస్త తైల సంస్కారంతో ఉండాలని మీకు తెలీదూ?"

"తెలుసండీ! ఇవాళ సిద్ధంగా రాలేదు. ఈ రోజే ఉద్యోగినయ్యాను కనక రేపట్నించి అలాగే ఉండడానికి ప్రయత్నిస్తాను."

"వెళ్లండి"......సుందరీబాయి అంతకంటె ఏమీ అడగలేదు. అతనిలో సుపరిచితమైన కొన్ని లక్షణాలు కనిపించాయి. కాని గుర్తించలేకపోయింది.

• • •

సుందరీబాయి మర్నాడు ఆదివారం—కార్లో బీచికి పోతూండగా దూరంగా రామానుజరావూ, పక్కనొక ఆడమనిషీ, ఒక అబ్బాయీ కూచున్నారు. సుందరీబాయికి కారు ఆపక్కనుంచి పోనివ్వాలనిపించింది. కారు రామానుజరావు పక్కనుంచే వెళ్లి ముందుగా ఆగింది. రామానుజరావు ఉత్సాహంగా ఉన్నాడు. సుందరీబాయి ఇటు తిరిగి చూసింది. ఆమె మరికొంచెం ఆశ్చర్యపడింది. రామానుజరావు పక్కనున్న ఆడమనిషిని కూడా ఎక్కడో చూసినట్టే గుర్తొచ్చింది. రామానుజరావు తన అధికారిణిని గుర్తించి నమస్కారం చేశాడు. ఆమె ఇటువైపే చూస్తూండడంవల్ల తనే ముందుకువెళ్లి, "ఈమె నా భార్యండీ. ఈ అబ్బాయి మా అబ్బాయే" అంటూ చెప్పుకున్నాడు. మిస్ సుందరీబాయి గురించి భార్యకు చెప్పాడు. రామానుజరావు భార్య సుందరీబాయిని ఒక్కసారి గుర్తుపట్టి, "మీరు బందర్లో ఉండేవారు కదండీ. అప్పుడు చదువుకొనేవారు. నేను మీయింటి పక్క పోర్షనులోనే మా దొడ్డమ్మగారింట్లో ఉండేదాన్ని. 'సరితై ఆరు'లో అనుకుంటాను" అన్నది. సుందరీబాయికి అంతా తెరలు తెరలుగా జ్ఞాపకం వస్తోంది.

"నీ పేరు సీతకదూ?"

"అవునండీ."

"జ్ఞాపకం వచ్చింది.....కులాసాగా ఉన్నావా? ఎంత మారిపోయావు!"

"మీరు కూడా అంతే కదండీ."

సీత కొన్ని గత స్మృతుల్ని తీసుకువచ్చింది. సుందరీబాయి కొన్ని వింటూ మాట్లాడింది. ఆమెకు అంతా జ్ఞాపక మొచ్చింది.

రామానుజరావు—పూర్వాశ్రమంలో రామానుజరావు—ఇప్పుడు కళ్లకు కడుతున్నాడు.

• • •

రామానుజరావు సన్నగా పొడుగ్గా ఉండేవాడు. గేయాలు వ్రాసి వరసలు కట్టి వినిపించేవాడు.

సుందరీబాయిని అప్పుడంతా 'సుందరీ' అని పిల్చేవారు. ఇంటర్లో మొదటి సంవత్సరం చదువుతుండేది. సుందరీబాయి తండ్రి దూరదేశంలో, రైల్వేలో పనిచేస్తూ ఇంటికి డబ్బు పంపించేవాడు. కూతురు చదువుకోసం ఎంతో శ్రమపడేవాడు. ఇంట్లో ఒక పోర్షను అద్దె కిమ్మని ఒకప్పుడు వ్రాశాడు.

సీతకు ఒక పెత్తల్లి ఉంది. ఆమె ఆమె కొడుకుల చదువులకోసం పట్నంలో ఉంటూ సుందరి ఇంట్లో పక్క పోర్షనులో దిగింది. అప్పుడే సీత తన పెత్తల్లిగారింటికి వచ్చింది. పెత్తల్లి కొడుకులంతా సీతను తమ సొంత చెల్లెల్లా చూసుకునేవారు. సీత ఎక్కడ లభ్యమయే ఆదరాన్ని అక్కడ పొందగలదు. ఉండవలసినంత చురుగ్గానూ, ఉత్సాహంగానూ ఉంటుంది. చక్కగా పాడేది.

అప్పుడు రామానుజరావు సీత అన్నదమ్ములకు—ముఖ్యంగా సుందరం అనే అబ్బాయికి—స్నేహితుడు. ఆ ఇంట్లో వీళ్లంతా చేరి ఒక కుటుంబంలా ఉండేవారు.

కొత్తలో—

రామానుజరావు ఒకనాడు వచ్చేసరికి సీతా, సుందరీ మాట్లాడుకుంటూ కూర్చున్నారు. అతను సీతను చూస్తూ అలాగే నిలబడిపోయాడు.

సుందరీబాయి రామానుజరావును చూసి మాట లాపివేసింది.

ఇది చూసి సీత నవ్వింది.

"ఎవరు కావాలి" అని అడిగింది సుందరి.

రామానుజరావు "సుందరం ఉన్నాడా?" అని సీతవైపు చూస్తూ ప్రశ్నించాడు.

"ఆ. పిలుస్తాను. కూచోండి" అంటూ సీత లోపలికి వెళ్లింది.

సీత లోపలికి వెళ్లిపోవడంతోనే, రామానుజరావుకు 'తాను సీతనే అడగడం' ఎంత పొరబాటో

గుర్తుకొచ్చింది.

సుందరికి ఈ సన్నివేశం వచ్చింది. "కూచున్నారు కాదు" అన్నది.

"ఫర్వాలేదండీ" అన్నాడు రామానుజరావు.

"మీ గేయాల్ని 'ప్రణయి' పత్రికలో చదివాను. చాలా బాగున్నాయి."

సుందరివైపు రామానుజరావు తిన్నగా పరీక్షగా చూడడం అప్పుడే! సుందరి తన సోగకన్నులతో ఓరగా చూసి కళ్ళు పక్కకు తిప్పుకొంది.

"మీ గేయాల్ని మీరే చక్కగా పాడతారని సీత చెప్పింది."

ఈ ప్రశంస ఇందాకటి ప్రశంసలా పని చేయలేదు. గురితప్పిపోయింది. రామానుజరావు మనస్సు సీత ఆక్రమించుకుంటున్న సమయంలో 'సీత చెప్పింది' అవగానే అతడికి సీత పట్లనే గౌరవం పెరిగింది. సీత వాళ్ళన్నయ్య సుందరాన్ని తీసుకొని మరీ వచ్చింది.

"ఇదుగో సుందరం! ఈమధ్య మీ సీత అబద్ధాలుకూడా చెప్తూంది" అన్నాడు సీతనుంచి జవా బేమిటి వస్తుందో అన్న సరదాలో రామానుజరావు.

"మీ రీ మధ్య అభాండాలు కూడా వేస్తున్నట్టుంది" అన్నది సీత.

"కాదు సీతా! నువ్వు ఈయన బాగా పాడతారని చెప్పావంటే—అది అబద్ధం అంటున్నారు" అన్నది సుందరి.

సీతకు కొంచెం నవ్వు వచ్చింది. తరువాత రామానుజరావువైపు చూసి "అయితే అబద్ధమే కాబోలు. ఆయన మాట కాదనే సాహసం నాకు లేదు" అన్నది.

"హతోస్మి" అన్నాడు రామానుజరావు.

## గతాను గతం

సుందరి రామానుజరావును ఆకర్షించలేదు. అప్రయత్నంగానే సీత రామానుజరావును ఆకర్షించింది. రామానుజరావు వస్తే ఎంతో మక్కువ చూపిస్తూండేది సుందరి. అతడి గేయాల్ని మధురగానాల్ని ప్రశంసించేది. రామానుజరావు సుందరి అభిమానానికి గర్వపడేవాడు. అంతకంటె సుందరిపట్ల 'ఆత్మీయత' పెరగలేదు. 'సుందరి తండ్రి ప్రయోజకుడూ సంపాదనపరుడూ, కుమార్తెను గారాబంగా చూసుకుంటున్నాడు. ఆమె జీవితం ఉన్నత స్థాయికి ప్రయాణం చేస్తుంది' అని విశ్వసించాడు.

'సీత తనలాటి సామాన్యుల బిడ్డ. సీత అంటే అందుకేనేమో ఆత్మీయత ఏర్పడింది' అనుకునేవాడు రామానుజరావు.

సుందరి మనస్సు రామానుజరావు చుట్టూ పరుగులు పెట్టినా అతణ్ణి తాకలేకపోయింది.

ఇంతలో సుందరి కాలేజి చదువు ముగిసింది. వాళ్ళ నాన్నగారు యూనివర్సిటీకి పంపాలని నిశ్చయించుకున్నారు. విడిపోయేటప్పుడు కూడా సుందరి హృదయంలో ఏమున్నదో ఎవ్వరికీ తెలియదు. వెళ్ళేటప్పుడు ఆమె కళ్ళలో నీరు తిరగడం రామానుజరావుకు కొన్నాళ్ళు గుర్తుండిపోయింది.

సంవత్సరం గడిచేవరకూ రామానుజరావు గేయాల్ని 'ప్రణయి'లో సుందరి చూస్తూండేది. ఆ తర్వాత రామానుజరావు గేయాలు పత్రికలో రాలేదు.

తర్వాత సుందరి దగ్గర్నుంచి రామానుజరావుకు ఒక ఉత్తరం వచ్చింది. అందులో "మీ గేయాల్ని చదివి ఆనందించడానికి ఉవ్విళ్ళూరే సుందరి ఇక్కడ ఉందని మరిచిపోకండి" అంటూ చివరను వ్రాసింది.

ఈ లేఖను కొత్త పెళ్ళికూతురు సీతకు చూపించాడు భర్త రామానుజరావు.

"పాపం. సుందరికి జాబు వ్రాయండి" అన్నది సీత.

"అవును. ఇకను ప్రణయ గీతాలు వ్రాయలేనని, వ్రాయనక్కరలేదనీ తెలియదు కదూ పాపం" అన్నాడు రామానుజరావు. మర్నాడే ఉత్తరం వ్రాశాడు.

తర్వాత సుందరి ఎక్కడుంటున్నదీ, ఏం చేస్తున్నదీ సీతకూ, రామానుజరావుకూ తెలియదు. వీరిద్దరి ఉనికీ సుందరికి తెలియదు.

యూనివర్సిటీ జీవితంలో సుందరికి అనేక కొత్త అనుభవాలు కలిగాయి. అనేక తరహాల వ్యక్తులతో ఎలా మెలగవలసి ఉంటుందో ఆమె గ్రహించింది. ఆమె భవిష్యత్తును తీర్చి దిద్దుకోవడానికి ఆ జీవితమే ప్రాతిపదిక అయింది. యూనివర్సిటీలో ఆమె ఉన్నత విద్యావంతురాలైన తర్వాత ఒక పెద్ద వ్యాపార సంస్థలో ప్రవేశించినట్టుగాని, స్వల్ప కాలంలోనే ఒక ప్రాంతీయ కేంద్రానికి అధికారిణి అయినట్టుగాని ఈ పది పదిహేను సంవత్సరాలలోనూ సీతా రామానుజరావులకు తెలియదు.

• • •

ఇవాళ సుందరీబాయి వెంటనే ఇంటికి రాలేదు. లేడీస్ క్లబ్‌కు వెళ్ళాలనిపించింది. కాని అక్కడ అయిదు నిమిషాలు కూడా ఉండలేకపోయింది.

కారుమీద తిరిగి వచ్చేస్తూండగా—రామానుజరావూ, సీతా వాళ్ళ అబ్బాయిని చెరోపక్కా పట్టుకొని తీసుకెళ్తూ కనిపించారు. తను ఏదో పరధ్యానంలో వీళ్ళతో చెప్పకుండానే కారెక్కి వచ్చేసినట్లు సుందరీబాయికి గుర్తొచ్చింది. 'తనకు అహంకారం బలిసిందని అనుకుంటారేమో! రామానుజరావుకు తను ఎంత విలువ ఇచ్చేది! సీత తనను ఎంత అభిమానంగా చూసేది!' ఆ పాత కథలన్నీ సుందరీబాయికి గుర్తు వచ్చినాయి. 'వీళ్ళిద్దరూ తనకు కావలసినవాళ్ళే' అనుకుంది.

హారన్ మోతతో ముగ్గురూ రోడ్ పక్కకు తొలగిపోయారు. కారు వాళ్ళకు పక్కగా ఆగింది.


"రండి. మీ బసకు దిగబెడతాను" అన్నది సుందరీబాయి.

"థాంక్స్. క్షమించండి. మా బస చాలా దగ్గర. కాస్తయినా సాయంత్రం నడుద్దామనే ఇలా వచ్చాం" అన్నాడు రామానుజరావు.

"ఎందుకండీ. వెళ్లిపోతాం" అన్నది సీత కూడా.

"మరేం ఫరవాలేదు రామానుజరావుగారూ! ఇక్కడ నేను బాస్ కాదు. మీరు ఉద్యోగి కాదు. రండి వెళ్దాం" అన్నది సుందరీబాయి.

చిత్రం—కలువకొలను సదానంద (వెంకటాపురం)



చివరికి తప్పింది కాదు. కారు వెళ్తూండగా సుందరీబాయి తనంత కొన్ని ప్రశ్నలు సీతనూ కొన్ని రామానుజరావునూ వేసింది. రామానుజరావును 'కవిత్వం మానేశారా' అన్నది. సీతను 'ఇంట్లోనయినా పాడుతున్నావా! మీ ఆయన గొంతు ఎత్తనివ్వరా' అన్నది. అన్నిటికీ సీతా రామానుజరావులు సమాధానాలు చెప్పారు. తిరిగి రామానుజరావు ఒక్క ప్రశ్న కూడా వెయ్యలేదు. సీత మాత్రమే ఏవో అడిగింది.

సుందరీబాయి కారును మధ్య నొక పక్క వీధిలోకి మళ్లించింది. రామానుజరావుకు అర్థం కాలేదు. కారు పెద్ద గేటుముందు ఆగింది.

"ఇదే నేనుంటున్న ఇల్లు. రండి. ఒక్క గడియ కూచొని వెళ్దురు గాని. నేను మీ ఇంటికి దిగబెడతాలెండి" అన్నది సుందరీబాయి.

సుందరీబాయి వెళ్లగానే వంటవాణ్ణి పిలిచి ఏవో చెప్పింది. తన గదులూ అధునాతనమైన ఫర్నిచరూ అన్నీ చూపించింది. తిరిగి వచ్చి గదిలో కూచున్నారు. ఫానుగాలి తగులుతూంది. వంటవాడు కాఫీ టిఫినూ పట్టుకువచ్చి బల్లమీద ఉంచాడు.

"తీసుకోండి" అన్నది సుందరీబాయి.

"ఎందుకండీ ఇదంతా" అన్నాడు రామానుజరావు.

"ఇప్పుడింటికి వెళ్లి భోంచెయ్యాలి కదండీ" అన్నది సీత.

అబ్బాయి టిఫినువైపు చూస్తున్నాడు.

"ఫరవాలేదు. ఇది అల్పాహారం. తీసుకోండి" అన్నది సుందరీబాయి.

అంతా పూర్తి అయాక సుందరీబాయి సీతనూ, రామానుజరావునూ ఇంటికి దిగబెట్టింది.

"మా ఇంట్లోకి ఒక్కసారి రండి" అన్నది సీత కారు దిగాక. వారితోబాటు డోరు తెరుచుకొని కిందకు దిగి నుంచున్న సుందరీబాయి సీత చెయ్యి పట్టుకొని "సీతా, మన చిన్నప్పుడు నన్ను ఇలా మన్నించేదానివా! ఇవాళ ఎందుకు 'మీ'రంటున్నావు" అన్నది.


"మిమ్మల్ని అలాగే పిలవాలనిపిస్తూంది. నా, కదే బాగుంటుంది."

"నీ ఇష్టం. నేను మాత్రం అలా మార్చుకోలేదు" అన్నది సుందరీబాయి.

సీత నవ్వుతూనే "లోపలికి రారూ" అన్నది.

"ఈసారి వస్తాను. చాలా రాత్రయుంది." "అప్పుడప్పుడు వస్తూండు సీతా" అంటూ స్టీరింగ్ ముందు కూర్చుని కారు స్టార్టు చేసింది సుందరీబాయి.

సుందరీబాయి ఇంటికి చేరిపోయిందే కాని తను ఒక పొరపాటు చేశానేమో అని మథన పడసాగింది. ఇంట్లోకి రమ్మని సీత ఎన్నిసార్లు చెప్పినా తను వెళ్లలేదు. తప్పించుకున్నట్టయుంది. 'ఆ చిన్న కొంపలోకి తను అడుగు పెట్టడానికి సంశయించా ననుకొన్నారేమో వాళ్లిద్దరూ?'



'శ్రీ స్వామి పుష్కరిణి'
(తిరుపతి)

ఫోటో—రఘు (తిరుపూరు)

తను రామానుజరావునూ సీతనూ రమ్మన్నది. వచ్చారు. కూచోమన్నది. కూచున్నారు. కాఫీ టిఫినూ తీసుకోమన్నది. తీసుకున్నారు.

వాళ్లు తమ ఇంట్లోకి తనను రమ్మన్నారు. తను వెళ్లలేదు.

ఈ దినచర్యంతా తన అధికారాన్నే చాటి చెబుతూంది. తనకు తెలియకుండానే తనలో ఆత్మగౌరవం అవధులు దాటిపోయిందనీ, తన ప్రవర్తన సీతమీదా, రామానుజరావు మీదా శాసన రూపంగానే జరిగిందనీ సుందరీబాయి బాధపడింది.

మర్నాడు మధ్యాహ్నం—రామానుజరావు ఆఫీసులో చాలా చిరాగ్గా ఉన్నట్లు కనిపించాడు. అలా ఎందుకున్నాడో సుందరీబాయికి అర్థం కాలేదు. ఆ సాయంకాలం రామానుజరావు ఇంటి కెళ్లింది. సీత ఎంతో ఆదరంగా లోపలకు తీసుకువెళ్లి కూచోపెట్టింది.

రామానుజరావు పడుకున్నవాడు హఠాత్తుగా లేచి నమస్కారం చేశాడు. "అదేమి! మీకు ఒంట్లో బాగులేదా" అన్నది సుందరీబాయి.

"మధ్యాహ్నంనుంచి కొంచెం తల నొప్పిగా ఉందండీ! ఇంటికి వచ్చేసరికి జ్వరం కూడా వచ్చేసింది" అన్నాడు రామానుజరావు.

"ఫరవాలేదు. రెస్టు తీసుకోండి.....రెండు రోజులు సెలవు తీసుకోండి."

## గతానుగతం

“థాంక్స్. కాని రేపుదయానికి జారిపోతే ఆఫీసుకు వచ్చేయొచ్చులెండి.”

“వద్దు. రెండు రోజులు ఇంటి దగ్గరే రెస్టు తీసుకోండి.”

మళ్ళీ ‘థాంక్స్’ అన్నాడు రామానుజరావు. సుందరీబాయి వెళ్ళేవరకూ ఆమెతో మాట్లాడుతూ సీత అనుసరించింది.,

తన గత జీవితాలలోని అస్పష్టమైన భావాలకు ఈనాడు ఒక రూపం కల్పించడం సుందరీబాయి ఉద్దేశ్యం కాదు. ఆ స్నేహం తిరిగి ప్రతిష్ఠించుకొని రామానుజరావుకు తన సహృదయతనూ, సంస్కారాన్నీ తెలియజేయాలనేదే ఆమె కోరిక. అయితే రామానుజరావులో జరిగిన మార్పులు ఆమె గమనించింది. మితభాషి అయిపోయాడు. అందరిలాగే తనను ‘బాస్’ అనే భావంతోనే సేవిస్తున్నాడు. రామానుజరావులో సహజంగా ఎన్ని మార్పులైనా జరుగవచ్చు కాని తత్కాలంలో అతని తత్త్వం నిశ్చయ నిశ్చితంగా ఉంటుంది.

* * *

సుందరీబాయి మర్నాడు ఆఫీసులో రామానుజరావు వచ్చినట్టు చూసింది. ఈ సందర్భంలో ఆమెకు ఈ అనుమానం ఉండనే ఉంది.

‘తను సలహా ఇచ్చే ధోరణిలో చెప్పినా రెండు రోజులు ఇంట్లో ఉండడంలో రామానుజరావుకు కష్టమేముంది! తను అలా సెలవు తీసుకోమని చెప్పకపోయినా బాగుండేది’ అనిపించింది సుందరీబాయికి.

సుందరీబాయి ముత్యాలు చేత రామానుజరావును పిలిపించింది.

“మీ ఒంట్లో బాగుందా?”

“ఆ. బాగానే ఉందండీ.”

“రెస్టు తీసుకోవడం మీ కిష్టంలేదా?”

“అనవసర మనిపించిందండీ.”

“సరే. మీ ఇష్టం. కాని ఇవాళ 20 నిమిషాలు లేటయ్యారట. ఈసారి అలా చేయకండి. వెళ్ళచ్చు” అన్నది సుందరీబాయి.

రామానుజరావు దిగ్భ్రాంతుడైపోయాడు. సుందరీబాయికి అతని నిర్లక్ష్యం నచ్చలేదు. తన మాటకు ఏమాత్రమూ విలువ ఇవ్వకుండా ఆఫీసుకు రావలసిన అగత్య మేమిటి! తన సానుభూతి అక్కర్లేనివాడయితే ఈ ఇరవై నిమిషాలు లేటు ఎలా చేయగలిగాడు! తనకు తెలుసన్న ధైర్యంతోనే కదా ఆలస్యంగా రావడం! సెలవు పెట్టడంలో తనకు కష్టమేముంది!’ రామానుజరావుకు ఎదటివారి మంచితనాన్నీ, హృదయాన్నీ అర్థం చేసుకొనే సానుభూతి లేదనిపించింది. రామానుజరావుమీద తను ‘అధికారం’ నెరపవద్దనుకున్నది. కాని రామానుజరావు తనను సెలుసుగా ప్రవర్తించేటట్లు చేశాడు.

“అరగంట లేట్ పెర్మిషన్ పెడుతున్నాను. పదిన్నరకు వచ్చినట్టు సంతకం పెట్టాను. ఈసారి లేటు కావద్దన్న మీ సలహాకు కృతజ్ఞుణ్ణి.” టేబులుమీద లేటు పెర్మిషన్ కోరుతున్న కాగితం ఉంచి రామానుజరావు వెళ్ళిపోయాడు. సుందరీబాయి మాట్లాడలేదు.

విశ్రాంతికి ఉన్న అరగంటలో ముత్యాలుతో రామానుజరావును పిల్చుకురమ్మన్నది. రామానుజరావు వచ్చి నిలబడ్డాడు.

“కూచోండి” అన్నది సుందరీబాయి. కూచున్నాడు.

“లేటు పెర్మిషన్ పెట్టవలసినంత అవసరమేమొచ్చింది?” గొంతు తగ్గించి మెల్లగా అడిగింది సుందరీబాయి.

సుందరీబాయి అడిగిన ఈ ప్రశ్నకు “ఎందుకు లేటయ్యారూ?” అనే అధికారం అర్థమో—“పెర్మిషన్ ఎందుకండీ ఈ మాత్రం దానికి” అనే సౌహార్దం అర్థమో మాటిగా రామానుజరావుకు తెలియలేదు.

“రాత్రల్లా జ్వరంచేత నీరసంగా ఉందీ. నడిచి రావడంలో ఆలస్యమైంది. అందుకే పెర్మిషన్ కోరాను.”

“ఎవ రేది చెప్పినా అది మిమ్మల్ని బాధించడానికే అనిపిస్తూ ఉంటుందా?”


రామానుజరావులో చలనం కలిగింది. తల ఎత్తి సుందరీబాయిని చూశాడు. పూర్వం అయితే

స్థాపితం 1920
రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు)
గోపాలపురం తూ.గో.జిల్లా
కుష్ఠు బొల్లి మేహపొడ
వగైరా చర్మ సుఖ వ్యాధులకు
శాస్త్రీయ- ప్రత్యేక చికిత్స.
ఆయుర్వేద ఔషధములు లభించును
→ కేటలాగు సలహా ఉచితము.
బ్రాంచిలు: వాల్తేరు ఆర్. ఎస్.
సికింద్రాబాద్ — 3560 కింగ్సువే

ఉబ్బసము
రొమ్ముపడిశము
జలుబు
అరికట్టు విధము

ఊపిరి దిగదీయుట, దగ్గు, శ్లేష్మము, గొంతు నొప్పి, ఉబ్బసము, రొమ్ము పడిశము, జలుబు మరియు శావజ్వరము మొదలగు వ్యాధులతో బాధపడు వేలకొలది రోగులు యిక పీటికి భయపడనవసరములేదు. అమెరికా దేశపు ఆధునిక ఔషధముతో శాస్త్రోక్తముగా తయారైన ఈమందు, గుండె, ముక్కు మొదలగు భాగములకు రక్తము ద్వారా వ్యాపించి శ్లేష్మమును హరించును. మీకు వెంటనే ఊపిరి బాగుగానడుచును. దగ్గు శ్లేష్మము తగ్గి పసిబిడ్డవలె నిద్రించగలరు. పూర్తిగా తృప్తి నిచ్చుటకు గ్యారంటీ యివ్వబడిన మెండకో (MENDACO)ను మీ కెమిస్టువద్ద కొనండి.

హోరాం సినిమా ప్రొజెక్టరుకు
ఆర్డరు యివ్వండి.




ఇంటిలో అద్భుతమైన వినోదం

సాహసాలు, ప్రేమ, వగైరా దృశ్యాలు మీ ఇంట్లోనే మా ప్రొజెక్టరుతో చూడండి. టార్చితో గాని ఏసి/డిసి ఎలెక్ట్రిసిటీతోగాని పని చేయును. 35 ఎం. ఎం. ఫిలిం. ధర రు. 15. 40 ఫిలిం 4'×3' స్క్రీన్, ఇన్‌స్ట్రక్షన్సు ఉచితం పోస్టేజి రు. 4—50 న.పై. డీలక్సు స్పెషల్ రు. 25. 60' ఫిలిం స్క్రీన్, ఇన్‌స్ట్రక్షన్సు ఉచితం. పోస్టేజి రు. 5. తృప్తిలేనిచో సొమ్ము వాపసు. స్టాకు మితంగాఉన్నది. నేడే ఆర్డరివ్వండి.

**Hollywood Cinema Corpn. (Regd.), (APW), 2194, Kalyanpura, Delhi-6.**

బాలానందకరమైనది




“సులేఖ”
మరియు
“బ్రీఫ్‌మన్”
ఫౌంటెన్‌పెన్‌లు

హెడ్డాఫీసు: పెన్‌మెన్ ఇండస్ట్రియల్.
సర్వీసెస్, బొంబాయి—67.
బ్రాంచి: పెన్‌మెన్ ఇండస్ట్రియల్ సర్వీసెస్,
ఇమాంపంజావీధి, బట్టలమార్కెటువద్ద,
విజయవాడ.

రామానుజరావును చాలా బాధించే దీ ప్రశ్న. [అత]ని ఉదాత్త భావాలకే అఘాతమయ్యేది. ఇప్పటి రామానుజరావు వేరొక మనిషి. [ఉదా]త్తమైన భావాలకు దూరమైపోయిన [రా]మానుజరావు ఈనాడు వాదన వేసుకోడు.

"ఎవరూ బాధ పెడుతున్నా రనుకోను. కాని బాధ పెట్టేవాళ్లు పెట్టడం, పడేవాళ్లు పడడం అన్నది వాటికి బాధ్యులైనవారికి తెలియకుండానే జరిగిపోతూంటాయి. ఇది సహజం."

సుందరీబాయి మాట్లాడలేదు. ఆమె ఆలోచిస్తూంది.

'రామానుజరావు ఎంత కరడు బారిపోయాడు! అతని హృదయంలో పూర్వం ఉన్న మార్దవం నేడు లేదు. తారతమ్యాలు, అల్పత్వ అధికత్వాలు బాగా తలకెక్కాయి. ఉన్నత స్థాయిలో ఉండే ప్రతివారూ తనకు దూరంగా కనిపిస్తారు. వాళ్లందరిపైనా అసంతృప్తీ వ్యతిరేకతా వంటివి పేరుకున్నాయి. వెన్నముద్ద విసిరినా రాయితో కొట్టారనే అనుకునే స్థితిలోకి వచ్చాడు. తనను తక్కువగా చూస్తున్నారేమో అన్న భావం మొరటుగానూ సంస్కారవిహీనుడుగానూ మనిషిని మార్చివేసింది.

"నేను వెళ్లవచ్చునాండి?" రామానుజరావు అడిగాడు.

సుందరీబాయి హఠాత్తుగా తల ఎత్తి "ఆఁ తప్పకుండా" అన్నది.


రామానుజరావు నిష్క్రమించాడు.

ఇంకా విశ్రాంతి సమయం పావుగంట ఉన్నది. పైన నవ్వులూ మాటలూ గట్టిగా వినిపిస్తున్నాయి. సుందరీబాయి ముఖంలో చికాకు కనిపిస్తూంది. టిఫినూ, కాఫీ పూర్తిచేసి కూజాలో మంచినీళ్లు తాగి కిటికీదగ్గర నిల్చుంది.

బయట ఎవరో గుసగుస లాడుకుంటున్నారు. అప్పలరాజు చుట్టూ అంతాచేరి వింటున్నారు. వాడేదో పళ్లు ఇకిలిస్తూ చేతు లూపుతూ మధ్య మధ్య పెడనవ్వులు నవ్వుతూ చెప్పుకుపోతున్నాడు. సుందరీబాయికి అతడంటే అసహ్యం. వాడి ముఖంలోనే ఈ ప్రపంచంలో 'చెడు' అంతా గూడు కట్టుకున్నట్టు కనిపిస్తుంది. ఆఫీసులో ఎవరిమీదో ఒకరిమీద చాలా అభూతకల్పనలూ, కొంచెం వాస్తవాలూ మిళాయించి కథలల్లి చెప్పడమే వాడి పని. అంతా అప్పలరాజు మాటలు శ్రద్ధగా వింటున్నారు.

"బీచి దగ్గర కూడానా?" ఒకడి ప్రశ్న.

"బీచి ఒక్కటేనా—తన కారూ, తన బంగాళా, సినిమా, చివరి కొక్క నిమిషం వ్యర్థం చేయకుండా ఆఫీసులో లీజరు టైములో కూడా ఒకర్ని ఒకరు విడవడంలేదు. వాళ్లకు కొంత పాతగాథకూడాఉందటలే! చూస్తున్నావుకదూ! మన నెప్పుడైనా తన రూమ్‌లోకి పూటకు నాలుగుసార్లు పిలిపించిందా? తలనొప్పి అంటే చాలు రెండు రోజులు రెస్టు తీసుకోమని చెప్పిందా? అంతా రామానుజరావుగాడి అదృష్టం రా. పడితే అలాటి బంగారు పిచ్చుకనే పట్టాలి."



వెలుగు నీడలు ఫోటో—ప్రసాద్ (కర్నూలు)

సుందరీబాయి అన్నీ విన్నది. తల తిరిగిపోయింది. కందిపోయిన ముఖంమీద చిరు చెమట పట్టింది. రెండు గంటలు కొట్టింది గడియారం.

సుందరీబాయి లేచింది. బెల్ కొట్టింది. ముత్యాలు వచ్చాడు.

"డ్రైవర్ని కారు తెమ్మని చెప్పు."

"చిత్తం" అని ముత్యాలు వెళ్ళుతున్నాడు.

సుందరీబాయి ముత్యాలును వెనక్కు పిలిచింది.

"ఆఫీసు మేనేజర్ని ఒకసారి రమ్మంటున్నానని చెప్పు."

ఆఫీసు మేనేజరు వచ్చి చేతులు కట్టుకు నిలబడ్డాడు.

"నేను ఈ పూటనుంచీ సెలవు పెడుతున్నాను. ఛార్జి తీసుకోండి" అన్న దామె.

ఆఫీసు మేనేజరుకు ఎన్నాళ్లు సెలవు పెడుతున్నదో ఏమో అడిగే సాహసంలేక ఊరుకున్నాడు. సుందరీబాయి ముఖం చూస్తూంటే మరేమీ అడగలేకపోయాడు.

సుందరీబాయి కారుమీద వెళ్లిపోయింది. ఆఫీసంతా రణగొణ ధ్వనిలో పడిపోయింది. ఆమె ఎక్కడికి వెళ్లిందో ఎవ్వరికీ తెలియలేదు. రామానుజరావువైపు ఓరగానూ, కోరగానూ కొందరు చూశారు. ఇంతవరకూ ఎప్పుడూ సెలవు పెట్టని సుందరీబాయి సెలవుపెట్టి ఎక్కడికి వెళ్లిందో అప్పలరాజు వంటి రంధ్రాన్వేషకునికి ప్రబల సమస్య అయింది.

సుందరీబాయి ఎక్కడికి వెళ్లిందో, ఇంకా ఎందుచేతను రాలేదో అనుకుంటూండగానే రెండు రోజులు గడిచాయి. రామానుజరావు మామూలుగా ఆఫీసుకు వస్తున్నాడు. మూడో రోజు మధ్యాహ్నం సుందరీబాయి కారుమోత ఆఫీసులో అందరికీ వినిపించింది.

సుందరీబాయి ఆఫీసులోకి అడుగుపెట్టింది. ఆమెతో ఒక బట్టతలాయన కూడా ఉన్నాడు. అతనికి ఆఫీసునూ, గుమాస్తాలనూ పరిచయం చేసి, అందరికీ—"వీరు మీ కొత్త ఆఫీసరు గారు"......అంటూ పరిచయం చేసింది, ఆ ముసలాయనను. ఆఫీసంతా నిశ్శబ్దం ఆవరించింది. సుందరీబాయి మరో ఆఫీసుకు బదిలీ చేయించుకొచ్చిందని అందరికీ అర్థమయింది. ఆమె ఆఫీసు వదిలివెళ్లేలోగా కొందరు గుమాస్తాలు వీడ్కోలు విందు చేస్తామని విన్నవించుకొన్నారు. ఒప్పుకోలే దామె.

సుందరీబాయి అందరి దగ్గరా సెలవు తీసుకొని వెళ్లబోతున్నది. ఆమె రామానుజరావు వైపు తిరిగింది.

రామానుజరావుకు గుండె నీరసంగా కొట్టుకుంటూంది. ఆమెతో ఏం మాట్లాడాలో తెలియలేదు.

"మీ ఉపకారం ఈ జన్మలో మరిచిపోను. కృతజ్ఞుణ్ణి."

"అలా అనకండి" అన్నది సుందరీబాయి.

"సెలవు" అన్నాడు రామానుజరావు. అతని కంఠం గద్గదమైంది. అతని గొంతు విన్న సుందరీబాయి, విశ్వాసంతో కలిసిన సన్నని స్వరంతో "మంచిదండీ" అన్నది.

సుందరీబాయి వెళ్లిపోయింది. ★